క్లుప్తంగా

పారిశుద్ధ్యం లోపించొద్దు

● ఎంపీఓ మహేందర్ రెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎంపీఓ

కంది(సంగారెడ్డి): గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి సూచించారు. శనివారం కందిలో పారిశుద్ధ్య పనులు, పలుచోట్ల లీకవుతున్న మంజీరా నీటిని పరిశీలించారు. లీకేజీలను వెంటనే అరికట్టాలని పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్‌ను ఆదేశించారు. గుంతల్లో నీరు నిలవకుండా చూడాలని చెప్పారు. ఎంపీడీఓ కార్యాలయంలో 5నుంచి 9వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్చదనంపై పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

20వ తిరుమల పాదయాత్ర



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

పటాన్‌చెరు టౌన్: జేపీ కాలనీలో తిరుమల మహా పాదయాత్రకు చెందిన పోస్టర్‌ను శనివారం వెంకటేశ్వర భక్తబృందం నిర్వాకుడు సీసల్ రాజు ముదిరాజ్ ఇతర సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులు బాగుండాలి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి యేడాదిలాగానే 20వ మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం మహంకాళి అమ్మవారికి పూజలు నిర్వహించి 30 మంది సభ్యులతో కలిసి తిరుమలకు పాదయాత్రను ప్రారంభిస్తామని చెప్పారు. భాస్కర్, మాణిక్యం, రాజశేఖర్, కొండల్ రెడ్డి, నగేశ్, అశోక్, అంబయ్య, రాము, తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు



బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మిర్జాపూర్(బి)లోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వినుత్న కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించి విజేతలకు హెచ్‌ఎం రాజ్‌కుమార్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, వెంకటేశం, శ్రీనివాస్, నవకుమార్, భాస్కర్, ఫైజొద్దీన్, లక్ష్మి, సల్మా పర్వీన్, సరోజిని పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య



శిక్షణ ఇస్తున్న ఎంఈఓ, ఆర్‌పీ

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను ప్రవేశ పెడుతున్నాయని, వాటిని విజయవంతం చేయవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎంఈఓ మారుతి రాథోడ్, ఆర్‌పీ మురళి అన్నారు. శనివారం న్యాల్‌కల్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో న్యాల్‌కల్, చాల్కి కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు ఎన్‌ఏఎస్‌లో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు నవంబరులో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన పరీక్షలు ఉంటాయని విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి: ఎస్ఎఫ్ఐ

నారాయణఖేడ్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తక్షణమే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ డిమాండ్ చేశారు. శనివారం సభ్యత్వ నమోదును ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరేళ్లుగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.7,792కోట్లను వెంటనే విడుదల చేయాలని, కాస్మెటిక్స్ చార్జీలు పెంచాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ కన్వీనర్‌గా గణేశ్, కో–కన్వీనర్‌గా అక్షయ్‌ను నియమించారు. కార్యక్రమంలో రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్.. !



దౌల్తాబాద్‌లో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

గ్రామాలలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా దాడిచేసి గాయపరుస్తున్నాయి. దీంతో పలు గ్రామాల ప్రజలు బయటకు వెళ్లాలంటేనే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి. మండల కేంద్రమైన హత్నూర, దౌల్తాబాద్, బ్రాహ్మణగూడ, సిరిపురం, గుండ్ల మాచనూర్ తదితర గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల హత్నూర, బ్రాహ్మణగూడలోని పలువురిని కుక్కలు కరచి గాయపరిచాయని, కుక్కల నుంచి తమను కాపాడాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

– హత్నూర(సంగారెడ్డి)

చర్యలు చేపడతాం

గ్రామాలలో కుక్కలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటాం. అన్ని శాఖల అధికారులతో మాట్లాడి ప్రణాళిక రూపొందిస్తాం. శునకాల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తాం.

– శంకర్ ఎంపీడీవో

చినుకు పడితే చిత్తడే..



ఇరిగిపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి

అధికారుల నిర్వహణ లోపం వల్ల పలు రోడ్లు చినుకు పడితేచాలు బురదమయంగా మారుతున్నాయి. మండలంలోని ఇరిగిపల్లికి వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. పలు గ్రామాలలో వర్షాకాలం కావడంతో మట్టిరోడ్లు చిత్తడిగా మారడంతో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు, గ్రామస్తులు జిల్లా కేంద్రానికి రావాలంటే ఈ దారులే దిక్కు. నడిచి వెళ్లాలన్నా, వాహనాలపై వెళ్లాలన్నా బురదరోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పలుమార్లు ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయపడిన సందర్భాలు చాలా ఉన్నాయి. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని తారురోడ్లు వేయాలని, లేకపోతే కనీసం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

– సంగారెడ్డి టౌన్

ఎంపీడీఓకు నోటీసులు



ఎంపీడీఓకు డీపీఓ పంపిన నోటీసు

సాక్షి ఎఫెక్ట్..

హత్నూర(సంగారెడ్డి): జిల్లా ఉన్నతాధికారులు ఎంపీడీఓకు నోటీసులు పంపించారు. సాక్షి దిన పత్రికలో ఒకటో తేదీన ప్రచురితమైన 'డంపు యార్డుల నిర్వహణ అస్తవ్యస్తం' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. శనివారం మండల పరిషత్ అధికారిని సంజాయిషీ అడిగారు. దీనిపై ఎంపీడీఓ శంకర్ జిల్లా పంచాయతీ అధికారికి వివరణ ఇచ్చినట్టు తెలిసింది.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సంబురాలు



జహీరాబాద్: చంద్రశేఖర్‌తో కలిసి హర్షం వ్యక్తం చేస్తున్న దళిత నాయకులు

జహీరాబాద్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తంచేస్తూ మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ఇంట్లో దళిత సంఘాల నాయకులు సంబురాలు జరుపుకున్నారు. జహీరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో శుభాకాంక్షలు తెలుపుకొని, బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాంచందర్, జ్ఞాన రత్నం, జయరాజ్, పద్మారావు, ముర్జల్, ప్రకాశం, రాజు, జాన్సన్, మధు, సత్యానంద్, సుభాష్, లక్ష్మయ్య, శాంతకుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

నారాయణఖేడ్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌక్‌లోని ఆయన విగ్రహానికి దళితనేతలు పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నోయేళ్ల పోరాటానికి న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో వెంకటరత్నం, ప్రవీణ్, శిరోమణి, అశోక్, దానయ్య, దేవదాస్, కె.సంగ్రాం, మొగులయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

మునిపల్లి(అందోల్): ఎస్సీ వర్గీకరణ చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చిత్ర పటాలకు మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. మైపాల్, సురేశ్ పాల్గొన్నారు.

పోరాడింది కాంగ్రెస్ ప్రభుత్వమే..

పటాన్‌చెరు టౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం అధికంగా పోరాడింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి చెప్పారు. తీర్పు నేపథ్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సామయ్య, సంజీవరెడ్డి, మతిన్, యువరాజ్, అతిక్, ఫయాజ్, సురేశ్, బాలరాజ్, అర్షిత్, హనుమంతు, మధు, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

● సీఐ మహేశ్‌గౌడ్



మాట్లాడుతున్న సీఐ మహేశ్‌గౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): యువత గంజాయి, మద్యం, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సీఐ మహేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం భవిత జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది డ్రగ్స్‌కు బానిసలుగా మారి తల్లిదండ్రులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని కోరారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నేత మాణిక్యం, అనిల్, విదార్థులు పాల్గొన్నారు.

వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

● సీఐటీయూ వినతి

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి పంచాయతీలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, కాని పంచాయతీ కార్యాలయంలో మాత్రం సహాయం చేసేవారు కరువయ్యారన్నారు. అనుమతులు తెచ్చుకొని ఇండ్లు నిర్మించుకుంటున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి వద్ద నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని వాపోయారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెన్షన్ కోసం వెళ్లి అదృశ్యం



మాణయ్య (ఫైల్)

నారాయణఖేడ్: పెన్షన్ డబ్బులు తీసుకువస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి తిరిగి రాకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని పైడిపల్లికి చెందిన వృద్ధుడు మంగ మాణయ్య గత 26న పెన్షన్ తీసుకొని వస్తానని ఖేడ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధు వులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

చికిత్స పొందుతూ మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శనివారం సీఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొబ్బిలిగామకు చెందిన నల్లోల్ల లక్ష్మయ్య(42) చందాపూర్ శివారులోని పెన్నార్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత ఒకటో తేదీన విధులకు హాజరై తన బైకుపై ఇంటికి వెళ్తుండగా ఆత్మకూర్ శివారులో అదుపు తప్పి పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

జిల్లా టాపర్‌గా దేవాంశ్

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాల ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షల్లో స్థానిక విద్యార్థి జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఆటలను కెరీర్‌గా చేసుకోవాలనే పిల్లల కోసం ప్రభుత్వం హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో మూడు క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేసింది. 4వ తరగతి ప్రవేశాల కోసం ఎంపిక పరీక్షలు నిర్వహిస్తోంది. ఇటీవల నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి పరీక్షల్లో మండలంలోని పెడగుట్ట తండాకు చెందిన ప్రకాశ్ జాదవ్ కుమారుడు దేవాంశ్ జిల్లా టాపర్‌గా నిలిచాడు. దీంతో ఉపాధ్యాయులు అతడిని అభినందించారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ

కంగ్టి(నారాయణఖేడ్): మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు నీట్‌లో ప్రతిభ కనపర్చారు. తుర్కవడ్‌గాంకు చెందిన గులే ప్రవీణ్ 523 మార్కులతో 3245వ ర్యాంకు సాధించాడు. కంగ్టికి చెందిన సిర్మా అఖిల 521మార్కులతో 3331వ ర్యాంకు సాధించింది. దీంతో విద్యార్థులను స్థానికులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

● చౌటకూర్‌లో ఇద్దరు, పుల్కల్‌లో ఒకరు
● పనిచేస్తుండగా జారిపడి మేస్త్రీ..
● పురుగుల మందుతాగి రైతు దుర్మరణం
● మరొకరికి తీవ్రగాయాలు



బాల్సింగ్

సంగారెడ్డి: ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు మరొకరు గాయపడ్డారు. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ శనివారం ఆ వివరాలు వెల్లడించారు. చౌటకూర్ మండలం శివంపేట వద్ద 161వ జాతీయ రహదారిపై మతి స్థితిమితంలేని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎన్‌హెచ్‌ఏఐ అంబులెన్సు సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఓ తాపీమేస్త్రీ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు రెండస్తుల భవనంపై నుంచి పడి మృతి చెండాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశంజిల్లా పొదిలి మండలానికి చెందిన వరికుంట్ల శ్యాంబాబు(35), కొమ్ము బోసు చౌటకూర్‌లో పార్కల రామ్‌రెడ్డి ఇంటి నిర్మాణ పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ప్లాస్టింగ్ పనులు చేస్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. వారిలో శ్యాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. గాయపడిన బోసు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే పుల్కల్ మండలం లక్ష్మీసాగర్ పరిధిలోని ఉమ్లానాయక్ తండాలో అప్పులబాధ తాళలేక ఓ గిరిజన రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పా ల్పడ్డాడు. తండాకు చెందిన నెనావత్ బాల్సింగ్(41) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. పెట్టుబడుల కోసం అప్పులు చేసి నష్ట పోయాడు. దీంతో తీవ్రమనస్తాపం చెంది శనివారం తెల్లవారు జామున ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఎస్ఐ కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: చదువుకున్నవారు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసేవారే ఎక్కువ శాతం సైబర్ వలలో చిక్కుకుని లక్షల్లో మోసపోతున్నారని జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఏపీఆర్‌లో సైబర్ నేరాలపై శనివారం అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలో సైబర్ నేరాలు అధికంగా జరుగుతుండడంతో హాట్‌స్పాట్‌లుగా గుర్తించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పార్ట్‌టైమ్ జాబుల పేరిట, అధిక లాభాలు, ట్రేడింగ్‌ల పేరుతో మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. సైబర్ నేరాల నుంచి మనల్ని మనం కాపాడుకుంటూ మన సమాజాన్ని కాపాడదామని పిలుపునిచ్చారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయడం ద్వారా లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి, ఏపీ ఆర్ లగ్జరీస్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, పచ్చదనంపై దృష్టి

● ఎంపీడీఓ శంకర్



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్

హత్నూర(సంగారెడ్డి): పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడం కోసం గ్రామాలలో నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శంకర్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో ఆ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 5నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాలలో యువత, నాయకులను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామాలలో కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్యం, మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ యూసుఫ్, ఆర్ఐ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఏపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మెప్మా ఆధ్వర్యంలో మేళా**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మెప్మా ఆధ్వర్యంలో మేళా నిర్వహించారు. మేళాలోని స్టాల్స్‌ను ఎంపీ రఘునందన్ రావు పరిశీలించారు. జిల్లా అధికారి గీత, బీజేపీ నేత గోదావరి పాల్గొన్నారు.

◆ **విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి**

వట్‌పల్లి(అందోల్): విద్యుత్ షాక్‌తో ఓ ఎద్దు మృతి చెందిన ఘటన కేరూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నిరుడి వీరయ్య తన ఎద్దులను మేతకు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో ట్రాన్సు ఫార్మర్ వద్ద వైర్ తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై ఒక ఎద్దు మృతి చెందింది. దాని విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

◆ **మున్సిపల్ సర్వసభ్య సమావేశం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని వైస్ చైర్మన్ రాములు గౌడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్‌లు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కుక్కలు, దోమల బెడదకు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

◆ **చర్యలు తీసుకోండి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): స్థానిక రాయసముద్రం చెరువు కట్టపై మాంసపు వ్యర్థాలు, చెత్తాచెదారాలను వేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పుష్పనగేశ్ అధికారులను కోరారు. శనివారం ఆమె చెరువును సందర్శించారు. ఆమె మాట్లాడుతూ చెరువు కట్ట సమీపంలో రాత్రి సమయంలో కొందరు మాంసపు వ్యర్థాలు, చెత్తను డంపు చేస్తున్నారని, దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

◆ **క్రీడా దుస్తుల పంపిణీ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లేపల్లి లలిత, హెచ్‌ఎం భాస్కర్ సమకూర్చిన క్రీడా దుస్తులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ రాములు గౌడ్, డీసీఈబీ చైర్మన్ లింబాద్రి పాల్గొన్నారు. సిద్ధారెడ్డి, సోమిరెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

జహీరాబాద్ టౌన్: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టౌన్ ఎస్ఐ కాశీనాథ్ సూచించారు. స్థానిక స్టేషన్‌లో శనివారం ఆటోడ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటోలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. సేఫ్టీ స్టిక్కర్లు అతికించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ **ఇన్‌చార్జి పంచాయతీ అధికారిగా సుభాష్**

కంగ్టి(నారాయణఖేడ్): మండల ఇన్‌చార్జి పంచాయతీ అధికారిగా సుభాష్‌ను నియమిస్తూ డీపీఓ సాయిబాబా ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎంపీఓగా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించిన వినోద్ కోహిర్ మండలానికి వెళ్లారు.

◆ **సమస్యలు పరిష్కరించాలి**

సంగారెడ్డి: ప్రశాంత్‌నగర్‌లో శిథిలావస్థకు చేరిన డ్రైనేజీలు, రోడ్లను నిర్మించాలని అలాగే వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ డీఈఈ ఇంతియాజ్ అహ్మద్‌కు శనివారం ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫోరమ్ అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరాంచాలన్నారు. సాయి కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **మధ్యాహ్న భోజనం పరిశీలన**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని తిమ్మన్న గూడెం, మాచిరెడ్డిపల్లి, పొట్టిపల్లి ప్రభుత్వ పాఠశాలలను శనివారం మండల విద్యాధికారి శంకర్ సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల పురోగతికి, ఉపాధ్యాయులంతా కృషి చేయాలని సూచించారు. హెచ్‌ఎంలు అనిల్ కుమార్, వినోద, సీఆర్పీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

◆ **తహసీల్దార్‌గా శివ శ్రీనివాస్**

కల్హేర్(నారాయణఖేడ్): ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శివ శ్రీనివాస్‌ను వికలాంగుల హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ శనివారం సన్మానించారు. పద్మ సంగమేశ్వర్, నవాబు పటేల్, ఆర్ఐ మల్లేశం, సిబ్బంది డేవిడ్, కార్తిక్ పాల్గొన్నారు.

◆ **రాష్ట్ర అధ్యక్షుడి మరణం తీరనిలోటు**

రాయికోడ్(అందోల్): జాతీయ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌ల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సీహెచ్ సంజీవ్‌కుమార్ అకాల మరణం తీరనిలోటని మండల టెక్నికల్ అసిస్టెంట్‌లు విచారం వ్యక్తం చేశారు. స్థానిక ఐకేపీ సమావేశ మందిరంలో సంజీవ్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ ఎంఎం షరీఫ్, ఎంపీఓ అంజలీదేవి, ఈసీ విష్ణువర్ధన్, టీఏలు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సీఓలు పాల్గొన్నారు.

◆ **ప్రిన్సిపాల్‌గా కృష్ణకుమార్**

పటాన్‌చెరు టౌన్: జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ కుమార్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక యువకులు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. విజయ్ గౌడ్, సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

◆ **పోరాటాలతోనే పరిష్కారం**

సదాశివపేట(సంగారెడ్డి): పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.వినోద అన్నారు. కరీంనగర్ జిల్లాలో తెలంగాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరగనున్న రాజకీయ శిక్షణ తరగతులకు స్థానిక నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పాండు, లింగం, పూలమ్మ, లక్ష్మి, యాదమ్మ పాల్గొన్నారు.

◆ **బీజేవైఎం మండల నూతన కమిటీ ఎన్నిక**

హత్నూర(సంగారెడ్డి): బీజేవైఎం నూతన మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగ ప్రభుగౌడ్ శనివారం తెలిపారు. అధ్యక్షుడిగా గణేశ్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, ఉపాధ్యక్షులుగా గిరీశ్, వేణుగోపాల్, కార్యదర్శిగా కృష్ణ నియామకం అయ్యారని చెప్పారు. సతీశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **కొర్రీలతో రైతులకు అన్యాయం**

నారాయణఖేడ్: రుణమాఫీకి కొర్రీలు పెడుతూ రైతులను ప్రభుత్వం మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల వల్ల కొందరు రుణమాఫీ పొందలేకపోతున్నారన్నారు. అనంతరం మంగల్‌పేట్‌కు చెందిన సీహెచ్ పండరి ఆస్పత్రిలో చికిత్స పొందగా అతని తండ్రి రాములుకు రూ.13,500, ర్యాకల్‌కు చెందిన సలాంసేట్‌కు రూ.60వేలు, నిజాంపేట్ మండలం జమ్మికుంటకు చెందిన కె.పండరికి రూ.16,500ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. సాయిరెడ్డి, జగదీశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.